క్లుప్తంగా

పొగాకు బ్యారన్ దగ్ధం

చీమకుర్తి: సంతనూతలపాడు గానుగపాలెంలో శుక్రవారం పొగాకు బ్యారన్ దగ్ధమైంది. వంగపాటి కోటేశ్వరమ్మకు చెందిన బ్యారన్‌లో పొగాకు కర్ర జారి కింద గొట్టాలపై పడటంతో మంటలు చెలరేగి పొగాకుకు అంటుకుంది. ఈ ప్రమాదంలో బ్యారన్ లోపల టైర్లు (కర్ర బారులు), గొట్టాలు, పొగాకు దగ్ధం కావడంతో సుమారు రూ.1.70 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఒంగోలు అగ్నిమాపక కేంద్రం వారు వచ్చి మంటలను అదుపు చేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మందా యలమంద మృతి

చీమకుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మందా యలమంద(52) శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు బంధువులు, మున్సిపల్ కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య తెలిపారు. యలమంద మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా గతంలో పనిచేశారు. దేవరపాలెం స్వగ్రామంలో ఆయన వైఎస్సార్‌సీపీలో చురుకైన నాయకుడుగా పనిచేస్తున్నారు. మూత్రపిండాలు దెబ్బతిని కొంత కాలంగా వైద్యం చేయించుకుంటున్నారు. ఆరోగ్యం విషమించటంతో శుక్రవారం రాత్రి మృతిచెందారు. పలువురు పార్టీనాయకులు వారి కుటుంబానికి సానుభూతిని తెలిపారు.

సినీ దర్శకుడు విశ్వనాథ్‌కు నివాళులు



చీమకుర్తి: సినీ దర్శకుడు కే.విశ్వనాథ్‌కు అభయ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. శుక్రవారం చీమకుర్తిలోని ఎస్‌కేఆర్ మానసిక వికాస కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. విశ్వనాథ్ సినీరంగంలో ఆణిముత్యాల వంటి సినిమాలకు దర్శకత్వం వహించారని, ఆయన జీవిత విశేషాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అంజిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు

ఒంగోలు: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించనున్న డీఆర్ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి శుక్రవారం పరిశీలించారు. పోటీల ప్రారంభానికి బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కేతినేని సురేంద్ర మోహన్ హాజరవుతున్నట్లు తెలిపారు. మూడు రోజులపాటు నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను క్రీడాభిమానులు విజయవంతం చేయాలని కోరారు.

కరాటే అసోసియేషన్ నుంచి కోలా ప్రతాప్ తొలగింపు

ఒంగోలు: కరాటే అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షునిగా కోలా ప్రతాప్‌ను తొలగించినట్లు స్పోర్ట్స్ కరాటే దో అసోసియేషన్ ప్రకాశం ప్రధాన కార్యదర్శి నల్లూరి మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాల కారణంగా తొలుత సస్పెండ్ చేశామని, తరువాత సకాలంలో వివరణ ఇవ్వకపోవడంతో అసోసియేషన్ నుంచి తొలగించినట్లు కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి రజనీష్ చౌదరి ప్రకటించారన్నారు. ఈ విషయాన్ని జిల్లాలోని కరాటే క్రీడాకారులు గమనించాలని నల్లూరి మోహన్‌రావు విజ్ఞప్తి చేశారు.

గడప గడపలో జగనన్న పథకాలు వివరించండి

- ప్రతి ఇంటికి ఇంకా రావాల్సిన పథకాలు వెంటనే అందేలా చూడాలి
- ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



గృహసారథులు, కన్వీనర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేతో పార్టీ నాయకులు

మద్దిపాడు: గడప గడపకు గృహసారథులు, కన్వీనర్లు తిరిగి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు అందుతున్నాయా లేదా అని పరిశీలిస్తూ వారికి రావాల్సిన పథకాలు ఏవైనా మిగిలి ఉంటే వెంటనే వారికి ప్రభుత్వం తరపున అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలకు చెందిన కన్వీనర్లు, గృహ సారథులకు శుక్రవారం రెండు విడతలుగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన వాగ్దానాల్లో 98 శాతం పూర్తి చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మాత్రమే దక్కిందని అన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా అనుయాయులకు మాత్రమే ఇవ్వకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఆయన పథకాలు వర్తింపజేస్తున్నారని, అందుకు వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. ఈక్రమంలోనే వచ్చే ఎన్నికల్లో 175 సీట్లు సాధించి క్లీన్ స్వీప్ చేసే దిశగా గృహ సారథులను, సచివాలయాలకు కన్వీనర్లను ఏర్పాటు చేశారని, కన్వీనర్లు ప్రతి ఇంటికి తిరిగి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి చూడలేని పచ్చమీడియా అసత్య ప్రచారాలకు పూనుకుంటోందని విమర్శించారు. కన్వీనర్లు, గృహ సారథులు పార్టీ ఆదేశాలు పాటిస్తూ పార్టీ ఉన్నతికి పాటుపడాలని పిలుపునిచ్చారు. పలువురు సీనియర్ నాయకులు గృహసారథులు చేయాల్సిన విధుల గురించి వివరించారు. మండల కన్వీనర్ల ఇన్‌చార్జి బత్తుల శ్రీనివాసరావు మాట్లాడుతూ కన్వీనర్లు, గృహ సారథులు కోఆర్డినేషన్‌లో పని చేసి పార్టీని పటిష్టం చేసేలా పనులు చేయాలని తెలిపారు. ఎంపీపీ దంపతులను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో వారి వెంట మండల పార్టీ అధ్యక్షుడు మండవ అప్పారావు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, జెడ్పీటీసీ తేళ్ల భాగ్యలక్ష్మి పుల్లారావు భారత పొగాకు బోర్డు సభ్యుడు మారెడ్డి సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీలు పైడిపాటి వెంకట్రావు, మోరబోయిన విజయలక్ష్మి, సీనియర్ నాయకులు గట్టినేని అయ్యన్న, మజీద్, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు బెజవాడ రాము, గుడ్డపాతల రవి, పొగాకు బోర్డు వైస్ ప్రెసిడెంట్ మద్దా లక్ష్మీనారాయణ, పోతినేని శ్రీనివాసరావు నర్రాసురేష్, మండవ బాల చంద్రమౌళి, పూనాటి అప్పారావు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, పార్టీ కార్యకర్తలు, గృహ సారథులు, గ్రామ కన్వీనర్లు పాల్గొన్నారు.

కూరగాయల వ్యాపారులకు బాలినేని అభయం



మార్కెట్ వ్యాపారులతో మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: నూతన కూరగాయల మార్కెట్‌లో పెంచిన షాపుల అద్దె ధరపై పునఃపరిశీలన చేసేలా చర్యలు చేపడతానని వైఎస్సార్ సీపీ రీజినల్ ఆకోర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. స్థానిక కూరగాయల మార్కెట్‌లో హోల్ సేల్ అండ్ రిటైల్ వ్యాపారులు ఏర్పాటు చేసిన సమావేశానికి బాలినేని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో వ్యాపారి పురిణి ప్రభావతి మాట్లాడుతూ.. 2008 నుంచి మార్కెట్‌లో ఎన్నో సమస్యలు ఎదుర్కొంటూ షాపులకు అద్దెలు కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇప్పుడు మరలా అద్దెలు పెంచుతూ నోటీసులు ఇవ్వడం తమకు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ.. మార్కెట్‌లో అందరి సమ్మతితో రేకుల షెడ్లు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అద్దె ఎంత మొత్తం ఉందో అందులో సగం చెల్లించాలని చెప్పారు. మార్కెట్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి ఆట ప్లాంటు ఏర్పాటు చేస్తామన్నారు. మార్కెట్లో దొంగతనాలు జరగకుండా ఉదయం ఒకరు, సాయంత్రం ఒకరు వాచ్‌మెన్‌ను నియమించేందుకు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. సమావేశంలో నగర మేయర్ గంగాడ సుజాత, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, 24వ డివిజన్ కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ, మున్సిపల్ ఇంజినీర్ మాల్యాద్రి, ఏఎంసీ చైర్మన్ కొటారి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలను కాపాడవచ్చు

- పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ప్రథమ చికిత్సపై అవగాహన



నోటితో గాలి పీల్చి శ్వాస అందిస్తున్న దృశ్యం

ఒంగోలు టౌన్: అత్యవసర సమయంలో సీపీఆర్ ద్వారా గుండెపోటు వచ్చినవారి ప్రాణాలను కాపాడవచ్చని జిల్లా పోలీసు యూనిట్ డాక్టర్ భానుమతి అన్నారు. డీ మొబలైజేషన్ కార్యక్రమంలో భాగంగా ఎస్పీ మలికా గర్గ్ ఆదేశాల మేరకు శుక్రవారం పోలీసు పరేడ్ గ్రౌండ్లో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు అధికారులు, సిబ్బందికి సీపీఆర్, ఇతర ప్రథమ చికిత్సలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గుండెపోటు వచ్చిన వెంటనే సీపీఆర్ ఎలా చేయాలో సంఘమిత్ర వైద్యశాలకు చెందిన సీపీఆర్ ఎమర్జెన్సీ టెక్నీషియన్లు డెమో ద్వారా అవగాహన కల్పించారు. గుండె ఆగిపోయిన వ్యక్తిని సమతలంగా నేలపై పడుకోబెట్టి ఛాతీపై రెండు చేతులు ఉంచి పుష్ చేయాలని తెలిపారు. నిమిషానికి 100 నుంచి 120 కంప్రెషన్స్ వరకు చేయాలని, మధ్యలో ప్రతి 30 కంప్రెషన్‌కు ఒకసారి కృత్రిమ శ్వాస అందించాలని, తద్వారా అంబులెన్సు వచ్చే వరకు లేదా వైద్యపరమైన సహాయం అందే వరకు ప్రాణాలను కాపాడవచ్చని వివరించారు. అలాగే రోడ్డు ప్రమాదంలో తలకు గాయమై రక్తస్రావం జరిగినప్పుడు, ఎముకలు విరిగినప్పుడు, చిన్నారులు నోటిలో కాయిన్స్ వేసుకున్నప్పుడు, ఈతకు వెళ్లి నీటిలో మునిగిపోయినప్పుడు, విషం తాగి అపస్మారక పరిస్థితిలో ఉన్నప్పుడు అందించాల్సిన ప్రథమ చికిత్సపై శిక్షణ ఇచ్చారు. ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఆర్ఐ శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

బాలినేనికి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్‌ల సన్మానం



బాలినేనిని సత్కరిస్తున్న నగర డ్రగ్గిస్ట్ అండ్ కెమిస్ట్స్ అసోసియేషన్ నాయకులు

ఒంగోలు: సమస్యలపై వేగంగా స్పందించి పరిష్కారానికి కృషి చేసిన వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్‌లు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం బాలినేనిని ఆయన నివాసంలో అసోసియేషన్ నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డ్రగ్గిస్ట్స్ అండ్ కెమిస్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు డి.కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు జి.మధుసూధన్‌రావు, నగర అధ్యక్షుడు జి.వెంకారెడ్డి, నగర కార్యదర్శి వి.సుబ్బారావు, కోశాధికారి వి.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

టి20 ప్రీమియర్ లీగ్ బ్రోచర్ ఆవిష్కరణ



టి20 టోర్నీ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: మెగా సౌత్‌జోన్ టి20 ప్రీమియర్ లీగ్ బ్రోచర్‌ను ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శుక్రవారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలినేని మాట్లాడుతూ.. తన, చిరంజీవి అభిమానులు సంయుక్తంగా సేవా కార్యక్రమాలతోపాటు క్రీడా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమన్నారు. చిరంజీవి చదువుకున్న శర్మ కాలేజీ గ్రౌండ్‌లో చిరంజీవి పేరుమీద ఈనెల 10 నుంచి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీలు న్విహిస్తున్న ఆర్గనైజర్లు డుంబు, బుజ్జి, పిచ్చయ్య తదితరులు మాట్లాడుతూ.. తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి 16 జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయని తెలిపారు. మొదటి బహుమతిగా రూ.2 లక్షలు, రెండో బహుమతిగా రూ.లక్ష, మూడో బహుమతిగా రూ.50 వేలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్, హజ్ డైరెక్టర్ ఎస్ఎం బాషా, ఘనశ్యాం, మెగా, బాలినేని అభిమానులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా నిలుస్తాం

- ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



గుండ్లకమ్మలో చేపపిల్లలు వదులుతున్న ఎమ్మెల్యేతో మత్స్యశాఖ జేడీ, ఎంపీపీ జెడ్పీటీసీ, ఇతర నాయకులు

మద్దిపాడు: స్థానిక మత్స్యకారులకు అండగా నిలుస్తామని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. మండలంలోని మల్లవరం సమీపంలో ఉన్న కందుల ఓబుల రెడ్డి గుండ్లకమ్మ జలాశయంలో శుక్రవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే మీనోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో నెల క్రితం 4.5 లక్షల చేపపిల్లలను వదిలారని, కానీ అవి సరిపోవన్న ఉద్దేశంతో జేడీ ఏ చంద్రశేఖరరెడ్డితో మాట్లాడామని జేడీ ప్రత్యేకంగా చొరవ తీసుకుని ఇక్కడి మత్స్యకారులకు మరో 11.57 లక్షల చేపపిల్లలను కొనుగోలు చేసి గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో వదిలేందుకు సన్నద్ధం చేయడం పట్ల స్థానిక మత్స్యకారుల తరపున అభినందనలు తెలిపారు. స్థానికేతర మత్స్యకారుల సమస్యను ప్రస్తావిస్తూ గతంలో స్థానిక మత్స్యకారులతో మాట్లాడినప్పుడు వారు బయటి జిల్లాల నుంచి వచ్చి ఇక్కడ చేపలు పడుతున్నారని చెప్పారని అన్నారు. వెంటనే తాను స్థానికేతర మత్స్యకారులను పంపించి వేయాల్సిందిగా అధికారులకు సూచించినట్లు గుర్తు చేశారు. వారు మళ్లీ రెండు నెలల తరువాత ఇక్కడికి వచ్చి వేట చేస్తున్నట్లు తన దృష్టికి తీసుకొచ్చారని, మత్స్యశాఖ జేడీ, తహశీల్దార్ ప్రత్యేకంగా చొరవ తీసుకుని పోలీసుల సహకారం తీసుకుని స్థానికేతర మత్స్యకారులను పంపి వేయాలని సూచించారు. మత్స్యకారులకు ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాల ద్వారా మత్స్యకారులు లబ్ధి పొందాలని ఆయన ఆకాంక్షించారు. గతంలో మాదిరి దళారులు లేకుండా లైసెన్సులు రెన్యువల్ చేయాలని అన్నారు. స్థానికేతర మత్స్యకారులకు లైసెన్సులు ఇస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో మత్స్యకారులకు భరోసా ఇచ్చేదిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలు అమలు చేస్తున్నారని, అందులో భాగంగానే ఫిష్ ఆంధ్ర పేరుతో పథకాన్ని ప్రారంభించారని అన్నారు. ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి మాట్లాడుతూ మత్స్యకారులకు అన్ని విధాలుగా ప్రభుత్వం తోడు ఉంటుందని అన్నారు. ముందుగా ఎమ్మెల్యే రిజర్వాయర్ వద్దకు చేరుకోగానే స్థానిక మత్స్యకారులు పూలు చల్లుతూ ఆహ్వానించారు. జేడీ ఆవుల చంద్రశేఖరరెడ్డి బొకే ఇచ్చి ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆలయ అర్చకులు నారాయణం వెంకటాచార్యులు, రాజశేఖరాచార్యులు గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులు ఇచ్చి ఎమ్మెల్యే చేతుల మీదుగా చేపపిల్లను రిజర్వాయర్‌లో వదిలారు. కార్యక్రమంలో ఆయన వెంట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఉమాదేవి, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి జెడ్పీటీసీ తేళ్ల భాగ్యలక్ష్మి పుల్లారావు, గ్రామ సర్పంచ్ పల్లపాటి లోకేశ్వరి, రాయపాటి రమేష్ వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఫిషరీస్ ఏడీ రవికుమార్, గుడ్డపాతల రవి, నర్రాసురేష్, యేమిరెడ్డి విజయభాస్కరరెడ్డి, కొప్పోలు ఆంజనేయులు, మాజీ సర్పంచ్‌లు పిట్టల ఆంజనేయులు, జయమ్మ, కృష్ణారెడ్డి సుబ్బారెడ్డి, అవినాష్ జవ్వాజి లక్ష్మీనారాయణ రెడ్డి మత్స్యకార సంఘ నాయకుడు జీవరత్నం, లాజరు, శేషయ్య పలువురు మత్స్యకారులు, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎంఏవై గృహ నిర్మాణాలపై మాగుంట ప్రశ్న

ఒంగోలు: ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గృహాల నిర్మాణంలో సెంట్రల్ శాంక్షనింగ్ అండ్ మానిటరింగ్ కమిటీ ఆమోదించిన ప్రమాణాలను మెజార్టీ లబ్ధిదారులు అందుకోలేకపోవడానికి కారణాలు, అక్రమాలు అరికట్టేందుకు, అనర్హ లబ్ధిదారుల ప్రయోజనాల నివారణకు ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పార్లమెంట్‌లో లేవనెత్తిన ప్రశ్నకు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి ఆర్‌కే సింగ్ సమాధానం ఇచ్చారు. దేశంలో అన్ని అర్హతలు కలిగిన పట్టణ లబ్ధిదారులకు పక్కా గృహాలు 2015 నుంచి మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాల విజ్ఞప్తిపై లబ్ధిదారులను కలపడం, తీసివేయడం అనేది ఎప్పటికప్పుడు జరుగుతుందని, దీని అమలుకు సంబంధించిన అక్రమాలు, ఫిర్యాదులు, ప్రాతినిధ్యాలన్నింటినీ సెంట్రలైజ్డ్ పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్ అండ్ మానిటరింగ్ సిస్టం ఆయా రాష్ట్ర, పట్టణ స్థాయిల్లో పరిశీలించి పరిష్కరిస్తున్నట్లు కేంద్ర సహాయ మంత్రి వివరించారు.

6న సీపీఐ ఆధ్వర్యంలో పోరుబాట

ఒంగోలు: ఈనెల 6న సీపీఐ ఆధ్వర్యంలో పోరుబాట ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి పీఆర్ చౌదరి విజ్ఞప్తి చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద టిడ్కో గృహాలను వెంటనే లబ్ధిదారులకు అందించాలని, అదే విధంగా జగనన్న ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలనే డిమాండ్లతో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. అదే విధంగా ఈనెల 22న విజయవాడలో పోరుబాటు ఉంటుందన్నారు.

ఉగాది నాటికి గృహ ప్రవేశాలు చేయండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ ఫజులుల్లా

చీమకుర్తి: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు తమ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి ఉగాది నాటికి గృహ ప్రవేశాలు చేయాలని చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు అధ్యక్షతన చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపంలో అర్బన్ పరిధిలోని మూడు లేఅవుట్‌లలో నిర్మిస్తున్న ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ లెంటల్, స్లాబ్ లెవల్ స్థాయిలో ఉన్న ఇళ్లన్నీ త్వరగా పూర్తి చేసుకోవాలని, ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి ఇంటి ముందు తెల్ల సున్నం వేసి నేమ్‌బోర్డులను అమర్చినట్లయితే ఫైనల్ బిల్లును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయం సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కార్మికులు గుర్తింపు కార్డులు పొందాలి

కొత్తపట్నం: కార్మికులు గుర్తింపు కార్డులు తీసుకుని ప్రమాద బీమా, సంక్షేమ పథకాలు పొందాలని లేబర్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కె.పవన్ కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, ఎడ్యుకేషన్, డిజిటల్ అసిస్టెంట్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ పి.సుజాత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ మాట్లాడుతూ.. పేద కుటుంబాల వారు కార్మిక గుర్తింపు కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు కార్మికులకు అవగాహన కల్పించాలని సచివాలయం సిబ్బందికి చెప్పారు. మండలంలో ఏడు సచివాలయాల పరిధిలో 1340 మంది కార్మికులు గుర్తింపు కార్డులు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వర్లు, ఈఓఆర్డీ ఎ.బాలచెన్నయ్య, ఏపీఓ రత్నజ్యోత్స్న పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో గృహాలు నిర్మించుకోవాలి

- ప్రత్యేకాధికారి, నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు

ఒంగోలు రూరల్: మండలంలోని జగనన్న కాలనీ లేఔట్లలో పట్టాలు పొందిన వారు త్వరగా గృహాలు నిర్మించుకోవాలని ప్రత్యేకాధికారి, ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని కరవదిలో జగనన్న కాలనీ లేఔట్‌ను కమిషనర్ శుక్రవారం ఉదయం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ డ్వాక్రా మహిళలు, వీఓఏలు లబ్ధిదారులతో మాట్లాడారు. కరవదిలో జగనన్న కాలనీ లేఔట్ కోసం అధిక వ్యయం ఖర్చు చేసినట్లు తెలిపారు. తాగునీటి కోసం ఓవర్‌హెడ్ ట్యాంక్, పైపు లైన్లు, మెటల్ రోడ్లు, త్రీ ఫేజ్ విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు వివరించారు. లేఔట్లలో విద్యుత్ దీపాలను కూడా ప్రత్యేకంగా అమర్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో కమిషనర్ మాట్లాడుతూ.. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టామని, స్థలం కోసం దరఖాస్తు చేసే సమయంలో ఉన్న ఉత్సాహం గృహ నిర్మాణాలు చేపట్టడంలో లేదన్నారు. మరో వారంలోగా ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని, లేదంటే పట్టాలను అర్హులైన ఇతర లబ్ధిదారులకు ఇచ్చేందుకు కూడా వెనుకాడేది లేదని స్పష్టం చేసారు. నిర్మాణ దశలో ఉన్న గృహాలను నిశితంగా పరిశీలించారు. రోడ్లను ఆక్రమిస్తే తాగునీటి పైప్‌లైన్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మార్చిలోగా కరవదిలోని 5 లేఔట్లలో గృహ నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ ఏఈ పృథ్వీ, విద్యుత్ ఏఈ చెన్నారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాబు, కరవది కార్యదర్శులు పూర్ణచంద్రరావు, వేమా శ్రీలక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు మణికంత, రమీజ్ పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి



కాఫీ విత్ క్లాప్ సిబ్బంది కార్యక్రమంలో ఎంపీడీఓ, కార్యదర్శులు

ఒంగోలు రూరల్: సచివాలయ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని కరవది, ఉలిచి, దేవరంపాడు, దేవరంపాడు హరిజనవాడ, బొద్దులూరివారిపాలెం, గుండాయపాలెం గ్రామ సచివాలయలను సందర్శించి బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. సచివాలయ సిబ్బంది తమ శాఖల పురోగతిని తెలియజేయాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం దృష్టి సాధించాలని, ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలన్నారు.

కాఫీ విత్ క్లాప్ సిబ్బంది

కరవది సచివాలయంలో శుక్రవారం ఉదయం కాఫీ విత్ క్లాప్ సిబ్బంది కార్యక్రమానికి ఎంపీడీఓ హాజరయ్యారు. క్లాప్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ప్రతి శుక్రవారం ఉదయం మండల స్థాయి అధికారి, గ్రామ కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యదర్శులు పూర్ణచంద్రరావు, శ్రీలక్ష్మి, క్లాప్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

కొత్తపట్నం: గ్రామ సచివాలయాలకు వచ్చే ప్రతి అర్జీని నిర్ణీత సమయంలోగా పరిష్కరించని సిబ్బందిపై చర్యలు తప్పవని ఎంపీడీఓ డాక్టర్ పి.సుజాత హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వెల్ఫేర్, ఎడ్యుకేషన్, డిజిటల్ అసిస్టెంట్లతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎంపీడీఓ మాట్లాడారు. సచివాలయం నుంచి అందిస్తున్న సేవలపై సమీక్షించారు. ఈఓఆర్డీ ఎ.బాలచెన్నయ్య మాట్లాడుతూ.. పీఎంజేఏవై సర్వే త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఏపీ సర్వీసెస్ పేమెంట్ ప్రతి సోమవారం మధ్యాహ్నంలోగా పెండింగ్ లేకుండా చూడాలన్నారు.